
# మామయ్యా.. నేను చదువుకుంటా..!

**మేనమామకు అల్లుడి లేఖ • సెల్‌ఫోన్ వ్యసనంతో 'ఇంటర్' నిరాకరణ**

**అల్లుడి అలవాటుపై మామయ్య హెచ్చరిక • వైరల్ అవుతున్న విద్యార్థి లేఖ**

ఎల్లారెడ్డిపేట, మే 29: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి సెల్‌ఫోన్ మత్తులో మునిగిన విషయాన్ని గుర్తించిన అతడి మేనమామ 'పై చదువులొద్దు.. సెల్‌ఫోనే ముద్దు' అంటూ హెచ్చరించడంతో కంగుతిన్న విద్యార్థి ఇకపై సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటానని రాసిన లేఖ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ బాలుడు ఇటీవల పదో తరగతి పాసయ్యాడు. అస్తమానం సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియా చూస్తూ రోజంతా గడపుతున్నాడు. గమనించిన ఓ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అతడి మామయ్య సెల్‌ఫోన్‌తోనే ఆడుకోవాలని.. ఇక చదువు అక్కర్లేదని తన అల్లుడిని హెచ్చరించాడు. దీంతో కంగుతిన్న బాలుడు తాను వాటికి దూరంగా ఉంటానని ప్రమాణం చేస్తూ మామయ్యకు లేఖ రాశాడు. ఈ లేఖ ప్రస్తుతం వైరల్‌గా మారింది. సెల్‌ఫోన్‌కు అడిక్ట్ అయిన పిల్లలను దారికి తెచ్చుకునే ఏ ప్రయత్నమైనా సంతోషమే అంటూ పలువురు 'మామయ్య హెచ్చరిక.. అల్లుడి మార్పు ఇక' అంటూ మెచ్చుకుంటున్నారు.



సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న విద్యార్థి లేఖ

# డిగ్రీలో 3.10 లక్షల సీట్లు ఖాళీ

- ఫస్టియర్‌లో 16% సీట్లే భర్తీ
- 74 కళాశాలల్లో సున్నా అడ్మిషన్లు
- దోస్త్ తొలి విడత సీట్ల కేటాయింపు
- కామర్సే కింగ్.. అత్యధికుల చేరిక
- ప్రభుత్వ కాలేజీలకే విద్యార్థులు జై
- 6 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్
- నేటినుంచి దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): డిగ్రీ మొదటి సంవత్సరంలో మొత్తం 3,71,096 సీట్లుంటే దోస్త్ మొదటి విడతలో కేవలం 60,436 సీట్లే భర్తీ అయ్యాయి. అంటే 3,10,660 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈసారి డిగ్రీ ఫస్టియర్‌లో కేవలం 16% సీట్లు మాత్రమే భర్తీకాగా, 84% సీట్లు ఖాళీగా ఉన్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మొదటి విడత సీట్లను గురువారం కేటాయించారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మీడియా సమావేశంలో దోస్త్ సీట్ల కేటాయింపు సమాచారాన్ని మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి వెల్లడించారు. ఈసారి 65,191 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకోగా, తొలి విడత 60,436 మంది సీట్లు పొందగా, 4,755 మంది పొందలేకపోయారు. సీట్లు పొందిన వారిలో అత్యధికులు అమ్మాయిలే ఉన్నారు. 38,041 మంది అమ్మాయిలు సీట్లు దక్కించుకోగా, 22,395 మంది అబ్బాయిలు సీట్లు కైవసం చేసుకున్నారు.

### కామర్సే కింగ్

ఈ సారి కూడా బీకాం కోర్సుదే హవా సాగింది. ఈ కోర్సులోనే అత్యధికులు చేరారు. 21 వేల మందికి పైగా సీట్లు పొందారు. ఆ తర్వాత వరుసగా బీఎస్సీ భౌతికశాస్త్రంలో 15 వేలు, బీఎస్సీ జీవశాస్త్రం కోర్సులో 11వేల మంది చొప్పున విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆర్ట్స్ కోర్సుల పట్ల విద్యార్థులు అంతగా ఆసక్తి చూపించలేదు. తొలి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయనిపక్షంలో సీటు కోల్పోతారు. దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్ శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నది. జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. జూన్ 13న రెండో విడత సీట్లను కేటాయిస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, ఇటికాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, కళాశాల విద్య ఆర్జేడీలు రాజేంద్రసింగ్, బాలభాస్కర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఇంగ్లిష్ మీడియంలోనే అత్యధిక ప్రవేశాలు

ఇంగ్లిష్ మీడియంలోనే అత్యధిక మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 60,436 మందిలో 58,575 మంది ఇంగ్లిష్ మీడియం వారే. తెలుగు మీడియంలో 1,552 మంది, ఉర్దూ మీడియంలో కేవలం 309 మంది చొప్పున ప్రవేశాలు పొందారు. హిందీ మీడియంలో ఒక్కరంటే ఒక్కరు కూడా చేరలేదు. గురుకులాలు మినహా మొత్తంగా 805 కాలేజీలు ఉండగా, ఈసారి 74 డిగ్రీ కాలేజీల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా చేరలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఒక్కరు చేరకపోగా, మిగతా 73 ప్రైవేట్ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. గత మూడేండ్ల కాలంలో 15 మంది లోపు విద్యార్థులు చేరిన ప్రైవేట్ కాలేజీలను బ్లాక్ చేశారు. ఆయా కాలేజీల్లో సీట్లు కేటాయించలేదు. సీట్లు పొందిన వారిలో 42,014 మంది మొదటి ప్రాధాన్యంగా ఎంచుకున్న కాలేజీల్లో సీట్లు పొందగా, 18,422 మంది రెండో ప్రాధాన్యంగా ఎంచుకున్న కాలేజీల్లో సీట్లు పొందారు.

### టాపర్లంతా అమ్మాయిలే

ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా దోస్త్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థుల ర్యాంకులను కేటాయించారు. ఈ ర్యాంకు, విద్యార్థులిచ్చిన ఆప్షన్లను బట్టి తొలి విడత సీట్లు కేటాయించారు. అన్నిరకాల కోర్సుల్లో టాప్-5 ర్యాంకర్లల్లో దాదాపు అమ్మాయిలే ఉన్నారు. ఒక్క కామర్స్ -మేనేజ్‌మెంట్ టాపర్‌గా అబ్బాయి నిలిచారు. పెన్మత్స తేజస్వి ఫిజికల్ సైన్స్ టాపర్‌గా నిలువగా, ఆకునూరి మీనాక్షి లైఫ్‌సైన్స్, పీ వసంత్ కుమార్ కామర్స్-మేనేజ్‌మెంట్, ఎం అంకిత ఆర్ట్స్ విభాగం టాపర్లుగా నిలిచారు. ఈ నాలుగు కోర్సుల్లో ఒక్కో కోర్సులో టాప్-5 టాపర్ల వివరాలను పరిశీలిస్తే ఒక్క వసంత్‌కుమార్ మినహా మిగతా 19 మంది అమ్మాయిలే ఉండటం గమనార్హం. మొత్తం 20 మందిలో 8 మంది వీరనారి చాకలి ఐలమ్మ వర్సిటీలోనే ప్రవేశాలు పొందారు.

**కోర్సుల వారీగా సీట్లు పొందిన విద్యార్థులు**

| కోర్సు | విద్యార్థుల సంఖ్య |
|---|---|
| కామర్స్ | 21,758 |
| భౌతికశాస్త్రం | 15,249 |
| జీవశాస్త్రం | 11,005 |
| ఆర్ట్స్ | 5,986 |
| ఇతర కోర్సులు | 6,438 |
| మొత్తం | 60,436 |

### ప్రభుత్వ కాలేజీల్లోనే ప్రవేశాలు అధికం

డిగ్రీ ఫస్టియర్‌లో చేరిన వారిలో అత్యధికులు ఈసారి ప్రభుత్వ కాలేజీల్లోనే ప్రవేశాలు పొందారు. అత్యధికంగా సీట్లు భర్తీ అయిన కాలేజీల్లో ప్రభుత్వ కాలేజీలే ఉన్నాయి. ఈసారి నిజాం కాలేజీలో 93.74% సీట్లు భర్తీ అయ్యాయి. ఈ కాలేజీలోనే అత్యధికంగా సీట్లు నిండాయి. ఈ కాలేజీలో ఖాళీ సీట్ల సంఖ్య 23 మాత్రమే. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో 93.19%, సిటీ కాలేజీ (హైదరాబాద్)లో 88.89, బేగంపేట మహిళా డిగ్రీ కాలేజీలో 82.69, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 80.98, బాబూ జగ్జీవన్‌రాంకాలేజీ (నారాయణగూడ)లో 80.29, ఎస్ఆర్ఆర్ కాలేజీలో (కరీంనగర్) 73.01, ఇందిరాప్రియదర్శిని (నాంపల్లి)లో 68.56, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (సుబేదారి) 66.01, గిరిరాజ్ కాలేజీ (నిజామాబాద్)లో 65.75% చొప్పున సీట్లు నిండాయి.

# గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులకు శ్రీకారం

## ఉత్తమ చిత్రం 'కల్కి 2898ఏడీ'

## ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్

ప్రతిభావంతులైన సినీ కళాకారులను ప్రోత్సహిస్తూ 1964లో నెలకొల్పిన నంది అవార్డుల స్థానంలో ప్రజా కళాకారుడు గద్దర్ పేరిట 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు'లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన విషయం విదితమే. గురువారం హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ కార్యాలయంలో 2024వ సంవత్సరానికి సంబంధించిన ఫిల్మ్ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో జ్యూరీ చైర్మన్ జయసుధ అవార్డుల వివరాలను వెల్లడించారు. ఈ అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు రాగా, వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించిన అనంతరం విజేతల పేర్లను ప్రకటించడం జరిగిందని జ్యూరీ చైర్మన్ జయసుధ తెలిపారు. 2014 నుంచి 2023 వరకు ప్రకటించాల్సిన ఉత్తమ చిత్రాల వివరాలను త్వరలో వెల్లడిస్తామని దిల్ రాజు పేర్కొన్నారు.



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ నిర్మించిన ప్రతిష్టాత్మక పానిండియా చిత్రం 'కల్కి 2898ఏడీ' ప్రథమ ఉత్తమ చిత్రంగా ఎంపిక కాగా, రూరల్ తెలంగాణ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన 'పొట్టేల్' ద్వితీయ ఉత్తమ చిత్రంగా ఎంపికయ్యింది. దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన 'లక్కీభాస్కర్' తృతీయ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఇక ఉత్తమ నటుడిగా 'పుష్ప 2' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఎంపిక కాగా, ఉత్తమ నటి అవార్డును '35 చిన్న కథకాదు' చిత్రానికి గాను నివేదా థామస్ గెలుచుకున్నారు.

దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), అనన్య నాగళ్ల (పొట్టేల్), దర్శకులు సుజిత్, సందీప్ (క) ,ప్రశాంత్‌రెడ్డి, రాజేష్ కల్లేపల్లి (రాజు యాదవ్), ఫరియా అబ్దుల్లా ('మత్తు వదలరా 2'లోని 'ర్యాప్' సాంగ్‌కి) స్పెషల్ జ్యూరీ అవార్డులను గెలుచుకున్నారు.

**తొలిసారిగా ప్రవేశపెట్టిన గద్దర్ తెలంగాణ అవార్డుల్లో ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని గెలుచుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ క్రెడిట్ మొత్తం దర్శకుడు సుకుమార్, మా నిర్మాతలు, పుష్ప టీమ్ మొత్తానికి చెందుతుంది. ఈ పురస్కారాన్ని నా అభిమానులకు అంకితమిస్తున్నా. మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలే నాలో స్ఫూర్తినింపుతున్నాయి – అల్లు అర్జున్**



### అవార్డుల విజేతలు

- ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప–2)
- ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్నకథ కాదు)
- ఉత్తమ చిత్రం: కల్కి
- ఉత్తమ ద్వితీయ చిత్రం: పొట్టేల్
- ఉత్తమ తృతీయ చిత్రం: లక్కీ భాస్కర్
- ఉత్తమ దర్శకుడు: నాగ్‌అశ్విన్ (కల్కి)
- జాతీయ సమైక్యత చిత్రం: కమిటీ కుర్రాళ్లు
- ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
- ఉత్తమ పర్యావరణం, వారసత్వం, చరిత్ర క్యాటగిరి చిత్రం: రజాకార్
- ఉత్తమ జనరంజక చిత్రం: ఆయ్ (డా.ప్రభాకర్‌రెడ్డి ఉత్తమ ప్రజాదరణ చిత్రం)
- ఉత్తమ పరిచయ దర్శకుడు: యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)
- ఉత్తమ సహాయ నటుడు: ఎస్.జె.సూర్య (సరిపోదా శనివారం)
- ఉత్తమ సహాయ నటి: శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
- ఉత్తమ గాయకుడు: సిద్ శ్రీరామ్ ('ఊరుపేరు భైరవకోన' సినిమాలోని 'నిజమేనే చెబుతున్నా..' సాంగ్)
- ఉత్తమ గాయని: శ్రేయా ఘోషల్ ('పుష్ప 2'లోని 'సూసేటి అగ్గి రవ్వమాదిరి..' సాంగ్)
- ఉత్తమ హాస్యనటుడు: వెన్నెల కిశోర్, సత్య (మత్తు వదలరా 2)
- ఉత్తమ బాలనటుడు: మాస్టర్ అరుణ్‌దేవ్ (35 చిన్న కథకాదు)
- ఉత్తమ బాలనటి: బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్)
- ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
- ఉత్తమ స్క్రీన్‌ప్లే: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
- ఉత్తమ ఛాయాగ్రహణం: విశ్వనాథ్‌రెడ్డి (గామి)
- ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ నృత్య దర్శకుడు: గణేశ్ ఆచార్య ('దేవర' సినిమాలోని 'ఆయుధ పూజ' సాంగ్)
- ఉత్తమ కళాదర్శకుడు: అద్నితిన్ జిహాని చౌదరి (కల్కి 2898ఏడీ)

చిత్రం



## వినాయక చవితికి 'మాస్ జాతర'

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ఉపశీర్షిక. భాను భోగవరపు దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. శ్రీలీల కథానాయిక. ఈ చిత్రాన్ని వినాయక చవితి సందర్భంగా ఆగస్ట్ 27న విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, వింటేజ్ వైబ్స్, కమర్షియల్ హంగులు కలబోసిన పర్‌ఫెక్ట్ మాస్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, దర్శకత్వం: భాను భోగవరపు.

## హృద్యమైన ప్రణయగాథ

'మ్యాడ్' ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ కథానాయికగా నటిస్తున్న చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ చిత్రాన్ని జూన్ 20న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయిక అనంతిక చీరకట్టులో అందంగా కనిపిస్తున్నారు. పొయెటిక్ ఫీల్‌తో సాగే ప్రేమకథా చిత్రమిదని.. ప్రేమ, ఎడబాటు, వేదన ప్రధానాంశాలుగా ఈ సినిమా తెరకెక్కిందని చిత్ర బృందం పేర్కొంది. హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన–దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి.



## సోమో ఐరానిక్ ఆర్ట్ క్రియేషన్స్

టాలీవుడ్‌లోకి సోమో ఐరానిక్ ఆర్ట్ క్రియేషన్స్ పేరుతో కొత్త ప్రొడక్షన్ హౌస్ ఎంట్రీ ఇచ్చింది. గురువారం ఈ సంస్థ లోగోను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సోమో ఐరానిక్ ఆర్ట్ క్రియేషన్స్ అధినేత జేజే మాట్లాడుతూ 'చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉంది. ఫిల్మ్ ఛాంబర్‌లోనూ మా సంస్థను రిజిస్టర్ చేయించాం. మా బ్యానర్ ద్వారా నూతన ప్రతిభావంతుల్ని ప్రోత్సహిస్తూ, కొత్త కథల్ని తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం. త్వరలో ఓ భారీ చిత్రాన్ని ప్రారంభించబోతున్నాం' అన్నారు.





## నమ్మకం నిజమో కాదో మీరే చెప్పాలి

'నేను కొన్ని బ్యాడ్ ఫిల్మ్స్ చేశా. వాటన్నింటినీ మరిచిపోయి, నేను చేసిన మంచి సినిమాలనే గుర్తుపెట్టుకున్నందుకు తెలుగు అభిమానులకు థాంక్స్. నేను 15 తెలుగు సినిమాల్లో నటిస్తే.. అందులో 13 విజయాలను సాధించాయి. విజయాలను మీరిచ్చారు. ఫ్లాపులు మాత్రం నేనే ఇచ్చాను. ఇది తీర్చలేని రుణం. 'థగ్‌లైఫ్' సినిమాను జూన్ 5న మీకు అందిస్తున్నా. నిజంగా గ్రేట్ ఫిల్మ్ ఇది. నాతోపాటు ఈ సినిమాలోని ప్రతీ ఒక్కరూ అద్భుతమైన పాత్రలు చేశారు. గొప్ప సినిమా చేశామని మేమంతా నమ్ముతున్నాం. మా నమ్మకం నిజమా? కాదా? అనేది మీరే చెప్పాలి.' అన్నారు కమల్‌హాసన్.. 'నాయకన్' వచ్చిన 38ఏండ్ల విరామం తర్వాత మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ నటించిన పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'థగ్‌లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ కీలక పాత్రధారులు. కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్, మణిరత్నం, శివ అనంత్, ఉదయ్‌నిధి స్టాలెన్ నిర్మాతలు. జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం విశాఖపట్టణంలో భారీగా నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకలో అభిమానులను ఉద్దేశించిన కమల్‌హాసన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శింబు, త్రిష, అభిరామి, నాజర్, శ్రేష్ఠ మూవీస్ అధినేత ఎన్.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిజాయతీని విడిచిపెట్టను

'స్పిరిట్' కథను లీక్ చేశారంటూ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఇటీవల ఓ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. వ్యక్తి ఎవరో చెప్పకుండా ఆయన నర్మగర్భంగా పెట్టిన ఆ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. ఇటీవల 'స్పిరిట్' సినిమా నుంచి నటి దీపికా పదుకోన్‌ని తప్పించిన నేపథ్యంలో.. 'స్పిరిట్' కథను ఆమే లీక్ చేసి ఉంటుందని, ఆమెను ఉద్దేశించే సందీప్ ఆ పోస్ట్ పెట్టారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో రీసెంట్‌గా ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న దీపిక.. అక్కడి మీడియాతో మాట్లాడిన మాటలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. 'జీవితంలో బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే నిజాయతీ ముఖ్యం. నేను దానికే విలువిస్తా. క్లిష్టపరిస్థితుల్లో నా మనసు చెప్పేదే వింటా. ఆ తర్వాతే నిర్ణయాలు తీసుకుంటా. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొంటా. ఈ క్రమంలో నా నిజాయతీని మాత్రం విడిచిపెట్టను' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సందీప్‌రెడ్డి పోస్ట్‌కు కౌంటర్‌గానే అని పలువురు భావిస్తున్నారు.





